క్లుప్తంగా

సీసీఆర్సీ కార్డులతో ఎటువంటి నష్టం లేదు

కాజులూరు: ఆంధ్రప్రదేశ్ పంటల సాగుదారుల చట్టం–2019 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పంటల సాగుదారుల హక్కుపత్రం (సీసీఆర్సీ కార్డు)తో భూ యజమానులకు ఎటువంటి నష్టం కలగదని శలపాక గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు అన్నారు. సాగుదారుల చట్టంపై రైతులకు అవగాహన తీసుకువచ్చి అర్హులైన రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించేందుకు బుధవారం శలపాకలో వీఆర్వో గనికమ్మ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గనిరాజు మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కేవలం 11 నెలల కాలపరిమితికి మాత్రమే కౌలురైతుకు సీసీఆర్సీ కార్డు ఇవ్వడం జరుగుతుందని భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. సభ ద్వారా పలువురు రైతులకు అధికారులు, నాయకులు కొత్త సీసీఆర్సీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ అనూషా, వీఏఏ కోటిపల్లి గోవిందు గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



పొగాకు వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యుడు క్రాంతికుమార్ తదితరులు

కె.గంగవరం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ద్రాక్షారామకు చెందిన భీమేశ్వర దంతవైద్యశాల ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి దంగేరు సెంటర్ వరకు నినాదాలతో ప్రజలకు పొగాకు వల్ల వచ్చే హాని గురించి అవగాహన కల్పించారు. ప్రముఖ దంతవైద్య నిపుణుడు క్రాంతికుమార్ మాట్లాడుతూ పొగాకు వల్ల పళ్లు కూడా పాడైపోతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి కేవలం పొగాకు వల్లే దంతాలు కోల్పోతున్నారని తెలిపారు. వలంటీర్లు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని వృద్ధుడి మృతి

కె.గంగవరం: మండలంలోని కూళ్ల పంచాయతీ శివారు మల్లవరంలో మంగళవారం రాత్రి ఇసుక తరలిస్తున్న లారీ ఢీకొని మద్దా సూర్యారావు (76) మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుందరపల్లి లేఅవుట్లకు ఇసుక తరలిస్తున్న లారీ మల్లవరం వద్ద బలంగా ఢీకొట్టడంతో సూర్యారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ లారీని వదిలేసి పరారయ్యాడని పోలీసులు తెలిపారు. కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కాజులూరు: అక్రమంగా మద్యాన్ని యానం నుంచి తరలించి అనధికారికంగా అమ్మకాలు చేస్తున్న బూసి దుర్గాప్రసాద్‌ని అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.వెంకటభవాని బుధవారం విలేకరులకు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు అతని ఇంటిని తనిఖీ చేసి 118 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కుమార్, కానిస్టేబుల్ వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

నిప్పంటుకుని ధాన్యం బస్తాల దగ్ధం


శలపాక అగ్నిప్రమాదంలో దెబ్బతిన్న ధాన్యం రాశులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో బుధవారం గ్రామానికి చెందిన రైతు కొప్పిశెట్టి వెంకటరమణకు చెందిన 95 ధాన్యం బస్తాలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ప్రమాదం వివరాలను రామచంద్రపురం అగ్నిమాపక శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు విలేకరులకు తెలిపారు. పక్క పొలాల్లో కోతలు పూర్తయ్యి మిగిలిన గడ్డికి పెట్టిన నిప్పు వెంకటరమణ పొలంలో నిల్వ చేసిన ధాన్యం బస్తాలకు అంటుకోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. సుమారు రూ.80 వేల నష్టం ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు.

శలపాకలో..

కాజులూరు: మండలంలోని శలపాకలో వల్లూరి రామకృష్ణ చౌదరి పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పక్కనే ఉన్న సుమారు 200 బస్తాల ధాన్యం రాశులు పాక్షికంగా దెబ్బతిన్నాయని వీఆర్ఓ కనికమ్మ బుధవారం విలేకరులకు తెలిపారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- నారుమడుల తయారీకి సన్నాహాలు
- 93,204 ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- ఆర్‌బీకేల్లో సిద్ధంగా విత్తనాలు, ఎరువులు


మండపేటలో నారుమడికి సిద్ధమవుతున్న పొలం

మండపేట: తుపానుల బెడదను అరికట్టడంతో మూడో పంట సాగు లక్ష్యంగా ముందస్తు సాగుకు అధికారయంత్రాంగం రైతులను సన్నద్ధం చేస్తోంది. జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల కానుండగా నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. అందుకోసం ఇప్పటికే విత్తనాలు, ఎరువులను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని రైతులకు అందజేస్తోంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 93,204 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగుచేయనున్నారు. ఏటా జూన్ పదో తేదీ తర్వాత కాలువకు నీరు విడుదల చేయడం, జూలై నెలాకరవు వరకు నాట్లు వేయడం జరుగుతోంది. దీని వలన నవంబర్ చివర్లో వచ్చే తుపానులతో రైతులు పంట నష్టపోవడం పరిపాటిగా మారింది. సాగు జాప్యంతో మూడో పంటగా అపరాల సాగుకు వీలు లేకుండా పోతోంది. సాగు నష్టాలను అధిగమిచి మూడో పంటకు సాగు జరిగేలా ముందస్తు సాగుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. అందుకోసం జూన్ ఒకటో తేదీన కాలువకు నీరు విడుదలకు నిర్ణయించింది. ఇప్పటికే దాళ్వా మాసూళ్లు పూర్తి కావచ్చాయి. త్వరలో కాలువలకు నీరు విడుదల కానుండటంతో తొలకరి పనులు ముమ్మరం కానున్నాయి. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయశాఖ రైతులకు అందజేస్తోంది. బోర్ల కింద రైతులు నారుమడులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. మండపేటతో పాటు ఏడిద, వెలగతోడు, తాపేశ్వరం గ్రామాలు, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో అక్కడక్కడ నారుమడులకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

విత్తనశుద్ధి చేయాలి

తెగుళ్లబారిన పడకుండా ఆరోగ్యకరమైన పంట కోసం మొలకశాతం, విత్తనశుద్ధి తప్పనిసరని మండల వ్యవసాయాధికారి కె.ఏసుబాబు సూచించారు. లేనిపక్షంలో మొలక సక్రమంగా రాకపోవడంతో పాటు పంటపై అగ్గి తెగులు, పొడ తెగులు, వేరుకుళ్లు తెగుళ్లు ఆశిస్తాయన్నారు. విత్తన శుద్ధి రెండు రకాలుగా చేయవచ్చునని, పొడి విత్తనశుద్ధిలో కేజీ విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజమ్ మందును కలపాలన్నారు. తడి విత్తనశుద్ధిలో కేజీ విత్తనాలకు ఒక గ్రాము కార్బండిజమ్ ఒక లీటరు నీటిలో కలిపి ఆ మందు ద్రావణంలో విత్తనాలు శుద్ధి చేయాలని వివరించారు. లేదా సూడోమోనాస్ అనే జీవశిలీంద్రనాశిని మందు కేజీకి ఎనిమిది గ్రాముల కలిపి విత్తనశుద్ధి చేయవచ్చునన్నారు. సూడోమోనాస్ మందు వ్యవసాయశాఖ వద్ద అందుబాటులో ఉందని, 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామన్నారు. మందు అవసరమైన రైతులు సమీప ఆర్‌బీకేలో సంప్రదించాలని సూచించారు.

కాలుష్య సమస్యను పరిష్కరించండి

రాయవరం: పసలపూడిలో కాలుష్యానికి కారణమవుతున్న చిన్న పరిశ్రమలపై చర్యలు తీసుకుని, కాలుష్య సమస్యను పరిష్కరించాలంటూ గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి డిమాండ్ చేస్తున్నారు. పసలపూడిలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల మధ్య అనధికారికంగా నవారీ, మడత మంచం గుడ్డల తయారీ పరిశ్రమ యూనిట్లను నిర్వహిస్తున్నారన్నారు. దీని వలన శబ్ద, జల, వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఫలితంగా పరిసర ప్రజలంతా ఊపిరితిత్తుతలు, ఆస్తమా, చర్మ వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నవారీ, మడత మంచం గుడ్డల తయారీలో భాగంగా రంగులు అద్దడం, అద్దకం పనులతో వెలువడే రసాయన పదార్థాలతో కూడిన నీటిని పంట కాలువల్లోకి వదిలి వేయడం వలన రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారం కోరుతూ పలుమార్లు పంచాయతీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. మే 29న జిల్లా కలెక్టరు కార్యాయలంలో స్పందనలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

నరసింహమూర్తి విగ్రహావిష్కరణ


కపిలేశ్వరపురంలో డాక్టర్ నరసింహమూర్తి విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట


వెదురుమూడిలో వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట

- కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన వైద్యులు కొండమూరి నరసహింమూర్తి తన నిజజీవితంలో వైద్య నారాయణుడిగా వెలుగొందారని ఎమ్మెల్సీ తోట త్రిమూరప్తల కొనియాడారు. స్థానిక పెద్ద వంతెన సమీపంలో నరసింహమూర్తి శిష్యులు నెలకొల్పిన ఆయన నిలువెత్తు విగ్రహాన్ని కాకినాడకు చెందిన డాక్టర్ పిండి లక్ష్మణమూర్తితో కలిసి ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ డాక్టర్ నరసింహమూర్తి తన నైపుణ్యంతో వందలాది మంది ప్రాణాలను కాపాడారన్నారు. భౌతికంగా నరసింహమూర్తి లేకపోయినా ఆయన చేతులు మీదుగా తర్ఫీదు పొందిన ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషియన్ల ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతూ ఆయన ఆశయం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో నరసింహమూర్తి సతీమణి సూర్యకాంతం, కుమారుడు డా. సత్యనారాయణ, అల్లుడు డాక్టర్ ఎం.రాంబాబు, మనువడు డా.రఘువీర్ కాంత్, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్లరాంబాబు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా మురళి, అరదాని శ్రీదేవి, పీఎంపీ అసోసియేషన్ నాయకులు సూరంపూడి వీరభద్రరావు, భద్రరావు, కూళ్ల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: వెదురుమూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఖండవిల్లి వెంకట సూర్య జగన్నాథాచార్యులు, వాడపల్లి నరసింహాచార్యులు, సుదర్శనం సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలోని పండితుల వేద మంత్రాల నడుమ ద్వారపాలకులైన జయ, విజయ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం వద్ద అన్న సంతర్పణ చేశారు. సర్పంచ్ చోడే రామతులసి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ గుణ్ణం భాను ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు చోడే సూరిబాబు, నక్కా సింహాచలం, ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకాలు

మండపేట: పట్టణంలోని బురుగుంట చెరువు వద్ద సీతారామక్షేత్రంలో ఉన్న సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం పంచామృతాభిషేకాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో మరింగంటి వరదాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సత్కారం

కపిలేశ్వరపురం: పదోతరగతి పరీక్షల్లో 576 మార్కులతో ప్రతిభ కనబర్చిన గ్రామానికి చెందిన దళిత విద్యార్థిని బొక్కే వర్షితను జెడ్పీ ఉన్నత పాఠశాల 1990–91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విద్యార్థిని ప్రశంసిస్తూ బుధవారం రూ.20వేలు నగదు బహుమతిని అందజేశారు.

సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే బిక్కిన కుటుంబం

మండపేట: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 3వ తేదీన కృష్ణార్జున చౌదరి మనువడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండపేట నియోజకవర్గ కన్వీనర్ చోడే సత్యకృష్ణ వివాహ వేడుక విజయవాడలో జరుగనుంది. ఈ సందర్భంగా వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ సీఎం జగన్‌కు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, సత్యకృష్ణ, యువజన విభాగం నేత శ్రీకృష్ణలు ఆహ్వాన పత్రికను అందజేశారు.


సీఎం జగన్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న డాక్టర్ బిక్కిన, రాజుబాబు, సత్యకృష్ణ, శ్రీకృష్ణ

రిటైర్డ్ ప్రొఫెసర్ నెక్కంటి శ్రీహరికి ఘన నివాళి

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల ప్రొఫెసర్ నెక్కంటి శ్రీహరికి బుధవారం ఘన నివాళులు అర్పించారు. ఈ నెల 20న తుది శ్వాస విడిచిన ఆయనకు గ్రామంలో సంతాప సభను నిర్వహించారు. వేలాది మందిని మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత శ్రీహరికి దక్కుతుందని వక్తలు కొనియాడారు. ఆయన చిత్రపటానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, ఆయన కుమారుడు, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ నివాళి అర్పించారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావుదొర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై రోగుల నుంచి వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో ప్రసవాలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు మమత, ఆదినారాయణలను ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, శ్రీనివాస్, కమలేశు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా షిరిడీ సాయి విగ్రహ ప్రాణప్రతిష్ఠ


మట్లచెరువులో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన సాయిబాబా విగ్రహం

రామచంద్రపురం రూరల్: మండలంలోని మట్లచెరువులో షిరిడీ సాయి సేవాశ్రమము ఆధ్వర్యంలో బుధవారం బాబా విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హోమ పూజలు, నేత్రోన్మీలనం, పూర్ణాహుతి, మధ్యాహ్న ఆరతిలతో కార్యక్రమం ముగించారు. బాబాకి చేసిన విశేష అలంకరణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి

మండపేట: కృష్ణ అండ్ మహేష్ టౌన్‌వైడ్ ఫాస్ ఆధ్వర్యంలో సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతిని బుధవారం మండపేటలో ఘనంగా జరిగాయి. మయూరి వృద్ధాశ్రమం, అంధుల పాఠశాలల్లో కేక్ కట్‌చేసి వృద్ధులు, విద్యార్థులకు అన్నదానం చేసి స్వీట్లు పంచారు. స్థానిక అలమూరు రోడ్డులో విజ్ఞాన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి 500 లీటర్ల మజ్జిగను అందజేశారు. అలాగే రాజారత్న, సప్తగిరి థియేటర్ల వద్ద బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన మోసగాళ్లకు మోసగాడు చిత్రానికి అధిక సంఖ్యలో కృష్ణ అభిమానులు హాజరయ్యారు. పట్టణ అధ్యక్షుడు మెండు సత్తిబాబు, ఉపాధ్యక్షుడు దుగ్గిరాల రాంబాబు, అభిమానులు దుగ్గిరాల గణేష్, మెండు రవిచంద్ర, పొలుబోతు గణేష్, రగడ, బట్టా అరుణ్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జేవీకే పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు


జేవీకే-4 వస్తువుల నాణ్యతను పరిశీలిస్తున్న డీఈవో కమలకుమారి

రామచంద్రపురం: 2023–24 విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక(జేవీకే)–4 పంపిణీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, జేవీకే పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా డీఈవో ఎం.కమలకుమారి హెచ్చరించారు. రామచంద్రపురం పట్టణం రత్నంపేట మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే స్టాక్ పాయింట్‌ను డీఈవో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేవీకే పంపిణీలో ఏ దశలోనూ లోపాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందన్నారు. ముఖ్యంగా నాణ్యత విషయంలో రాజీపడలేదన్నారు. ప్రతి దశలోను క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు ఏర్పాటు చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జేవీకేలో పంపిణీ చేసే యూనిఫామ్, షూస్, స్కూల్ బ్యాగ్స్, బెల్టు తదితర వస్తువులను జిల్లాలో ప్రతి స్టాక్ పాయింట్ వద్ద మోడల్ కిట్‌ను ప్రదర్శిస్తున్నామన్నారు. నాణ్యత లోపించిన వస్తువులను దిగుమతి చేసుకోకుండా, ఆ అధికారాన్ని క్వాలిటీ కంట్రోల్ టీమ్‌కు ప్రభుత్వం అప్పగించిందన్నారు. జూన్ మొదటి వారం నుంచి స్కూల్ పాయింట్లకు జేవీకే4 కిట్లను సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు స్కూల్ బ్యాగ్స్, బెల్టులు మినహా అన్ని రకాల వస్తువులు మండల స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయన్నారు. ఒకటి రెండు రోజుల్లో మండల పాయింట్లకు స్కూల్ బ్యాగ్స్, బెల్టులు సరఫరా అవుతాయన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రతి విద్యార్థి చేతిలో జగనన్న విద్యా కానుక కిట్‌ను ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జేవీకే–4లో సరఫరా కాబడిన వస్తువుల నాణ్యతను డీఈవో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో డీఈవో కార్యాలయ ఏడీ ఎస్.సురేష్, సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం


కల్యాణంలో అలరారిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వార్షిక కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణంలో భాగంగా పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన, బలిహరణ తదితర పూజలు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణ ఘట్టాలను వేద పండితులు అంగర సూర్యనారాయణాచార్యులు భక్తులకు వివరించిన తీరు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, ఈవో ఎస్.అయ్యపరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాపల్గొన్నారు.

జనార్దనస్వామి కల్యాణం ప్రారంభం

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీష్షమ జనార్దన స్వామి కల్యాణ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఖండవిల్లి వెంకట సూర్య జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలోని పండితులు దేవతామూర్తులకు పూజలు చేశారు. స్వామిని గ్రామంలో ఊరేగించారు. కల్యాణ ఉత్సవ పూజలు ఈ నెల 5 వరకూ కొనసాగుతాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గోపి మహాలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యులు అంగర బద్రినారాయణాచార్యులు, ఈఓ కె.శ్రీనివాస్ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో క్యాంపు కార్యాలయం


నూతన గృహంలో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివావేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన గృహం వద్ద నూతన క్యాంపు కార్యాలయాన్ని మంత్రి వేణు పురోహితులు మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా బుధవారం ప్రారంభించారు. మంత్రి వేణు–వరలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి తనయులు నరేన్, ఉమాశంకర్, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: మండలంలోని వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో డి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల ప్రకారం మండలంలోని సోమేశ్వరం, మాచవరం పంచాయతీల పరిధిలో ఒక్కొక్క వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జూన్ 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం దరఖాస్తు ప్రతిని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు.

మున్సిపాలిటీలో చారిత్రక ఘట్టం

- తొలిసారిగా శెట్టిబలిజ సామాజికవర్గానికి చైర్మన్ గిరీ
- తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వైస్ చైర్మన్ గణేశ్వరరావు
- ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపిన శెట్టిబలిజ సంఘం నాయకులు


తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వైస్ చైర్మన్ గణేశ్వరరావు


గణేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట, శెట్టిబలిజ సంఘం నాయకులు

మండపేట: మండపేట మున్సిపాల్టీలో బుధవారం కౌన్సిల్ సమావేశంలో చారిత్రక ఘట్టం చోటుచేసుకుంది. వ్యక్తిగత పనులతో హైదరాబాద్‌లో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఈ సందర్భంగా చైర్మన్ స్థానంలో సమావేశం నిర్వహించే అరుదైన అవకాశం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో తొలిసారిగా శెట్టిబలిజ సామాజికవర్గానికి దక్కింది. కౌన్సిల్ సమావేశానికి చైర్‌పర్సన్ హాజరుకాలేని సమయంలో తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించాలి. మండపేట కౌన్సిల్‌లో శెట్టి బలిజ సామాజికవర్గం నుంచి పిల్లి గణేశ్వరరావు, కమ్మ సామాజికవర్గం నుంచి వేగుళ్ల నారయ్యలు వైస్ చైర్మన్లుగా ఉన్నారు. 1956లో మండపేట మున్సిపాలిటీ ఆవిర్భవించగా ఇప్పటి వరకూ కమ్మ సామాజికవర్గం వారు పలుమార్లు చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించగా పట్టణంలో బలమైన సామాజికవర్గాల్లో ఒకటిగా ఉన్న శెట్టిబలిజ సామాజికవర్గానికి కనీసం వైస్ చైర్మగాను అవకాశం దక్కలేదు. కాగా వైఎస్సార్ సీపీ పాలకవర్గం అధికారంలోకి వచ్చాక శెట్టిబలిజ సామాజికవర్గానికి పెద్దపీట వేస్తూ ఎమ్మెల్సీ తోట తొలి వైస్ చైర్మన్ పదవికి పిల్లి గణేశ్వరరావుకు పట్టం కట్టారు. తాజాగా వారి చిరకాల వాంఛను నెరవేస్తూ బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షత స్థానంలో సమావేశం నిర్వహించే బాధ్యతను గణేశ్వరరావుకు అప్పగించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ తోట ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హాజరయ్యారు.

గణేశ్వరరావుకు ఘన సత్కారం

శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గణేశ్వరరావును సమావేశం అనంతరం కౌన్సిల్ సభ్యులు, మండపేట శెట్టిబలిజ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, సంఘ నాయకులు పెంకే గంగాధర్, యాంద్ర బుజ్జి, చొల్లంగి గోవిందు, పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ మండపేట మున్సిపాలిటీ చరిత్రలో తమ సామాజిక వర్గానికి తొలిసారి వైస్ చైర్మన్ పదవి ఇవ్వడంతో పాటు తాత్కాలిక చైర్మన్‌గాను బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందన్నారు. శెట్టిబలిజ సామాజికవర్గానికి ప్రాధాన్యమిస్తూ సముచిత స్థానం కల్పిస్తున్నారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలను చర్చించి సభ్యులు ఆమోదించారు. 21వ వార్డులో విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కరించాలని ప్రతిపక్ష సభ్యులు కోరగా ఇప్పటికే ఉన్నతాధికారులతో మాట్లాడామని, త్వరలో పట్టణమంతా విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్సీ తోట తెలిపారు. మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.